మత్తడిగూడలో నీటి తంటాలు

బిందెలతో నీరు తీసుకెళ్తున్న గ్రామస్తులు

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని శంభు మత్తడిగూడ గ్రామస్తులు రెండు నెలల నుంచి తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. గ్రామంలో 50 కుటుంబాలు ఉండగా.. 150 మందికిపైగా జనాభా ఉంటారు. వీరికి ఒకే ఒక చేతి పంపు ఉంది. అది కూడా పని చేయడం లేదు. దీనికితోడు రెండేండ్ల నుంచి మిషన్ భగీరథ నీరు కూడా సక్రమంగా రావడం లేదు. దీంతో అర కిలోమీటర్ దూరంలో గల సమీప గ్రామమైన సుంగు మత్తడిగూడలోని చేతి పంపు, కరెంటు బోరు ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. పంచాయితీ కార్యదర్శి, ఎంపీడీవో గ్రామ సమస్యలు పట్టించుకోవడం లేదని వాపోయారు. నీటి వసతి కల్పించాలని వేడుకున్నారు. - ఉట్నూర్ రూరల్, మే 18

ప్రధాన రహదారి పచ్చదనం

2014కు ముందు ఆగ్రామం అసలు రెవెన్యూ రికార్డుల్లో లేదు. అలాంటిది నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని కప్ర గ్రామం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ హయాంలో జీపీగా ఏర్పడింది. గ్రామంలో రైతువేదిక, శ్మశానవాటిక, క్రీడా ప్రాంగణం, సెగ్రిగేషన్ షెడ్డు నిర్మించారు. ఆర్అండ్బీ రోడ్డు నుంచి 1.5 కిలో మీటర్ల వరకు వేసిన తారురోడ్డుకు ఇరువైపులా హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి చెట్లు పందిరి రూపమెత్తాయి. ఉక్కపోతతో కొట్టుమిట్టాడుతూ అటుగా వెళ్లే వారికి ఊరటాన్నిస్తున్నాయి.

- కుభీర్, మే 18

కుభీర్ : కప్ర అప్రోచ్ రోడ్డు గుండా ఏపుగా పెరిగిన చెట్లు

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ

వర్షంతో మురుగు కాలువల నుంచి రోడ్డుపై వచ్చిన చెత్త

ఇంద్రవెల్లి, మే 18: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ, మురుగు కాలువలు అధ్వానంగా మారింది. పారిశుధ్యంతో పాటు చెత్తతో మురుగు కాలువలు నిండి ఉండడంతో చిన్నపాటి వర్షానికి డ్రైనేజీల నుంచి మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి దుకాణ సముదాయాల ముందు పారుతుంది. ఆదివారం మధ్యాహ్నం వచ్చిన వర్షానికి మురుగు కాలువలో నీరు రోడ్డుపైకి వచ్చింది. రోడ్డుకు అనుకొని ఉన్న దుకాణాల ముందు మురుగు చెత్త రావడంతో వ్యాపారస్తులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికైన గ్రామ పంచాయతీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని పారిశుధ్యం లోపించకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ పరీక్ష

ఎదులాపురం, మే 18 : ఆదిలాబాద్ జిల్లాలో ఐఐటీ జేఈఈ. అడ్వాన్స్ పరీక్ష ప్రశాంతంగా సాగింది. పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 5 :30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు నిర్దేశిత సమయం కంటే ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకోగానే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. ఉదయం సెషన్ లో 100 మందికి గానూ 98 మంది, మధ్యాహ్నం సెషన్లో 100 మందికి 95 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికార వర్గాలు తెలిపారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల సౌకర్యార్థం తగు ఏర్పాట్లు చేశారు.

వివేకానంద అనాథ ఆవాసానికి విరాళం

భైంసా, మే 18 : నిర్మల్ జిల్లా భైంసాలోని వివేకానంద అనాథ ఆవాసానికి పెంచికల్పాడ్కు చెందిన అవదూత్ వార్ రాములు ఆదివారం రూ. 15 వేలు విరాళంగా అందజేశారు. ఇక్కడ శైలేష్ మాశెట్టివార్, కృష్ణదాస్, రంగు రవి, లింగారెడ్డి ఉన్నారు.

బాధితునికి ఎమ్మెల్యే పరామర్శ

ఆడె పరశురాంతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, మే 18: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని ఖండిపల్లె గ్రామానికి చెందిన ఆడె పరశురాం డయాలసిస్తో బాధపడుతున్నాడు. ఆదివారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్య సాయం కోసం సహకారం అందిస్తామన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, బీ శ్రీధర్ రెడ్డి, జక్క శ్రీధర్ రెడ్డి, సురేందర్ యాదవ్, ఎలుక రాజు, అల్లకొండ ప్రశాంత్, ప్రవీణ్, దేవేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ప్రతాప్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, మే 18 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని కరంజి గ్రామానికి చెందిన యేల్టి విజయలక్ష్మి తల్లి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. ఆయన వెంట సంతోష్, బట్టు సతీశ్, కుమ్ర రాజు ఉన్నారు.

నార్నూర్లో భారీ వర్షం

నార్నూర్, మే 18 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వేసవి తాపం నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. చేతికి వచ్చిన జొన్న పంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ఇచ్చోడ(సిరికొండ), మే 18 : మినీ వ్యాన్ బోల్తా పడి ఐదుగురు గాయాలైన ఘటన శనివారం అర్ధరాత్రి సిరికొండ మండలంలోని నేరడిగొండ(జీ) వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జైనూర్ మండలంలోని బూసిమెట్ట గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి నిశ్చయమైంది. ఈ క్రమంలో వరుడిని వధువు ఇంటికి తీసుకొచ్చేందుకు నేరడిగొండ(జీ)కి చెందిన 30 మంది శనివారం ఉదయం మినీ వ్యాన్లో బయలుదేరారు. రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడపడంతో సిరికొండ మండలంలోని నేరడిగొండ(జీ) వద్ద వ్యాన్ బోల్తా పడింది. ఇందులో కుమ్రం సుంగు, కుమ్రం రాహుడ్, ఆత్రం సందూర్, కుమ్రం యశ్వంత్, ఆర్కా గంగారాంకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్లో రిమ్స్కు తరలించారు. ఆదివారం క్షతగాత్రులకు అందిస్తున్న చికిత్సను రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జై సింగ్ పరిశీలించారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

బేల, మే 18: ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని పోనాల గ్రామానికి చెందిన ఠాక్రే మహాదేవ్ (28) అనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నాగ్నాథ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..ఠాక్రే మహదేవ్ మద్యానికి బానిసై ఇంట్లో భార్యతో గొడవ పడగ మందలించడంతో శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి గాలించగా తన పొలంలో పురుగుల మందు తాగి ఉన్నాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108లో ఆదిలాబాద్ రిమ్స్కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి మృతి : సాంగ్వీలో విషాదఛాయలు

కుభీర్, మే 18: నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి కట్కం గంగాప్రసాద్ (21) శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామస్తులను విషాదంలో ముంచింది. ఆదివారం మధ్యాహ్నం భైంసాలో పోస్టుమార్టం అనంతరం యువకుడి మృతదేహాన్ని కడసారి చూసేందుకు గ్రామస్తులు ఆర్అండ్బీ రోడ్డులోని సాంగ్వి బస్స్టాప్ వరకు తండోపతండాలుగా చేరుకున్నారు. నాలుగు రోజుల క్రితమే ఇంటికి వచ్చిన యువకుడి మృతదేహాన్ని చూసి మహిళలు బోరుమన్నారు. ఒక్కగానొక్క కొడుకు అప్పుడే ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు సొమ్మసిల్లి పడిపోయారు. యువతీ, యువకులు, మహిళలు, వృద్ధులు, స్నేహితులు వందలాదిగా అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం,మే 18 : జిల్లా పోలీసు శాఖ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. ఆదివారం పోలీస్ ముఖ్య కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కత్తులు, తల్వార్లు, ఆయుధాలు ఉపయోగించి సోషల్ మీడియాలో పోస్ట్లు చేస్తూ ప్రజల్లో భయాందోళనలు కలిగించే వారికి ఉపేక్షించబోమన్నారు. కత్తులతో డబ్బులు వసూలు చేసే వారికి చట్టబద్ధంగా శిక్ష తప్పదన్నారు. ఫిర్యాదులు వచ్చిన నిందితులను జైలుకు పంపించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలోని ఉట్నూర్, ఆదిలాబాద్ సబ్ డివిజన్లలోని పోలీసు అధికారులు, ఎస్హెచ్ఓలకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రౌడీయిజానికి పాల్పడే వారిపై రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేస్తూ జిల్లా పోలీస్ శాఖ పర్యవేక్షణ కొనసాగుతుందని వివరించారు. వీడీసీ సభ్యులు చట్టవ్యతిరేకంగా వసూళ్లు చేయడం, గ్రామాల్లో బెల్ట్ షాపులు, కల్లు కాంపౌండ్లకు, ఇసుక ట్రాక్టర్లకు అనధికారిక అనుమతులిచ్చే వ్యవహారాలు సహించబోమన్నారు. ఇటువంటి చర్యలపై తీవ్రంగా స్పందించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనలపై ప్రత్యేక డ్రైవ్లు నిర్వహించబడుతాయని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.దాబాలలో మద్యం సేవించడం, అమ్మకాలు చేయడం నిషేదించాలని, రోడ్డుపై వాహనాలు నిలిపి ప్రమాదాలకు దారి తీసే విధంగా ఉండకూడదని సూచించారు. గంజాయి వినియోగం, వ్యాపారం, సాగు వంటివి నిషేధించబడి, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సామాజిక సంఘాల పేరుతో దోపిడీకి యత్నించడాన్ని, పశువుల తరలింపు వాహనాలను అనధికారికంగా ఆపడం వంటి చర్యలను తీవ్రంగా ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. రాత్రి 10:30 గంటల తర్వాత వ్యాపార సంస్థలు మూసివేయాలని, 11 గంటల తర్వాత అనవసరంగా బయట తిరిగే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను వాహనాలకు బిగించి నడపరాదు, వాహన కంపెనీలు ఇచ్చిన సైలెన్సర్లను మాత్రమే ఉపయోగించాలన్నారు. అధిక వడ్డీ పేరుతో ప్రజల ఆస్తులు లాక్కొనడం, ప్రభుత్వ, మున్సిపాలిటీ భూములను ఆక్రమించడం వంటి చర్యలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని వెల్లడించారు. పబ్లిక్ ప్రదేశాల్లో ఓపెన్ డ్రింకింగ్, రాష్ డ్రైవింగ్, మద్యం సేవిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని, రాత్రి సమయంలో ప్రత్యేకంగా గస్తీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్లపై పశువులను నిర్లక్ష్యంగా వదిలేసే యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పబ్లిక్ స్థలాల్లో మున్సిపల్ శాఖ అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం నేరమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఏడాది వరకు జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించబడుతుందని తెలిపారు.

నాటి జ్ఞాపకం.. నేటికీ పదిలం

భైంసా: 2005-06 పదో తరగతి పూర్వ విద్యార్థులు

భైంసా, మే 18 : నిర్మల్ జిల్లా భైంసాలోని జేఆర్ఎం హైస్కూల్లో 2005-06లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం డాక్టర్ అసోసియేషన్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమను ప్రయోజకులుగా చేసిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

బేల, మే 18: ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సాంగడి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002- 03 బ్యాచ్కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక మూర్తిజి మహారాజ్ ఫంక్షన్ హాల్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను పిలిపించి సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు.

నిర్మల్ చైన్గేట్, మే18 : నిర్మల్లోని జుమ్మేరాత్ పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. అప్పుడు విద్య నేర్పిన గురువులను సన్మానించారు

బేల: 2002- 03 బ్యాచ్కు చెందిన పూర్వవిద్యార్థులు



నిర్మల్చైన్గేట్: గురువులతో పూర్వ విద్యార్థులు

పేకాట రాయుళ్ల అరెస్ట్

తలమడుగు, మే 18 : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామ శివారులో ఆదివారం పేకాటాడుతున్న ఆరుగురిని ఎస్ఐ రాధిక అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ.1400, మూడు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం, 52 ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లబెల్లం, పటికతో వెళ్తున్న వాహనం పట్టివేత

దస్తురాబాద్,మే 18 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలో నల్లబెల్లం, పటికతో తరలిస్తున్న బోలోరా వాహనాన్ని పట్టుకున్నట్లు నిర్మల్ సీఐ రంగస్వామి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..కొద్ది రోజులుగా దస్తురాబాద్ మండలంలో రేవోజిపేట, మున్యాల, ఎర్రగుంట గ్రామాల్లో నాటుసారా తయారీదారులకు నల్లబెల్లం, పటిక అమ్ముతున్నారని సమాచారం మేరకు శనివారం రాత్రి మున్యాల గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. బోలోరా వాహనాన్ని తనిఖీ చేయగా 340 కిలోల నల్లబెల్లం, 20 కిలోల పటిక లభించినట్లు తెలిపారు. ఆ వాహనంలో బాదవత్ రమేశ్ అనే వ్యక్తి ఉన్నారు. అతడిని విచారించగా జన్నారంలోని ఎర్ర సంపత్కి చెందిన కిరాణం నుంచి నల్లబెల్లం పటిక తీసుకొని వచ్చి దస్తురాబాద్ మండలంలో నాటు సారాయి తయారీదారులకు అమ్ముతామని తెలిపినట్లు వివరించారు. బాదవత్ రమేశ్, ఎర్ర సంపత్పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. బోలోరా వాహనాన్ని, 340 కిలోల నల్లబెల్లం, 20 కిలోల పటికను స్వాధీనం చేసుకొని స్టేషన్కి తరలించినట్లు తెలిపారు. ఎస్ఐ వసంతరావు, అభిషేక్, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీ మృతుల స్మారకార్థం ర్యాలీ

నిర్మల్ చైన్గేట్, మే 18: హెచ్ఐవీ మృతుల స్మారకార్థం ఆదివారం అంతర్జాతీయ స్మారక దినాన్ని నిర్వహించారు. ఆదిలాబాద్లోని ప్రసూతి దవాఖాన ఆవరణలో జిల్లా నియంత్రణ సంస్థ షుర్ ఎన్జీవో లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. ఎయిడ్స్ వ్యాధితో మృతి చెందిన వారికి మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్ష్మి, జిల్లా సూపర్వైజర్ అనిల్కుమార్, ఎన్జీవో సంస్థ నిర్వాహకుడు మల్లికార్జున్, ఎల్ డబ్ల్యూఎస్ సంస్థ సూపర్వైజర్ శశిమాల, ఐసీటీసీ కౌన్సిలర్లు, సుదర్శన్, రాంచందర్, మహిపాల్రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం, మే 18 : ఆదిలాబాద్ రూరల్ మండలం సాలెగూడ గ్రామంలో ఆదివాసులు వేసుకున్న బోరుబావిని ఫారెస్టు అధికారులు బండరాళ్లు, మట్టితో పూడ్చివేయడాన్ని తుడుందెబ్బ మండలి ఖండించింది. ఈ ఘటనపై బాధ్యులైన అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని సాలెగూడ గ్రామాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. తాగునీటి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన బోరుబావిలో నీరు లభించినప్పటికీ, ఆదివాసులు లేని సమయంలో ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇది అన్యాయమని, వెంటనే ప్రత్యేక బోరు ఏర్పాటు చేసి నీటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలాం వరుణ్, డివిజన్ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, ఆదిలాబాద్ రూరల్ మండలాధ్యక్షుడు కేశవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు మర్సుకోల భరత్, ప్రచార కార్యదర్శి ఉయిక దినేశ్ ఉన్నారు.

మహారాష్ట్ర నుంచి తరలిస్తున్న 30 టన్నుల జొన్నలు పట్టివేత

తలమడుగు, మే 18 : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ చెక్పోస్టు వద్ద మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న జొన్నలను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్కు లారీలో 30 టన్నుల జొన్నలు తరలిస్తుండగా లక్ష్మీపూర్లో తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు సీఐ ఫణిందర్ తెలిపారు. డ్రైవర్ను విచారించగా దూలే జిల్లా నేరా గ్రామానికి చెందిన రాజేశ్గా గుర్తించారు. ఏతావో పసుల వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రాధిక, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్కును అభివృద్ధి చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 18 : నిర్మల్లోని దివ్యనగర్ పార్కును 15 రోజుల్లో అభివృద్ధి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం దివ్యనగర్ పార్కును కలెక్టర్ సందర్శించారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ మరమ్మతులు, గోడ నిర్మాణం చేపట్టి మొక్కలు నాటి పార్కును పచ్చదనంతో నింపాలని సూచించారు. ఆమె వెంట డీ హరిభూషణ్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

నగదు సాయం

సోన్, మే 18 : నిర్మల్ మండలంలోని భాగ్యనగర్ గ్రామానికి చెందిన అల్లం రాము కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని తోటి స్నేహితులు చేయూతనందించారు. జడ్పీహెచ్ఎస్ రత్నాపూర్కాండ్లీలో తనతో పదో తరగతి చదువుకున్న తోటి విద్యార్థులంతా కలిసి ఇటీవల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. కాగా తమతోటి స్నేహితుడు రాము క్యాన్సర్తో బాధపడుతున్నాడని తెలుసుకొని తమవంతుగా పూర్వవిద్యార్థులంతా కలిసి రూ.15,500 అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

భైంసాటౌన్, మే 18 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని మహగాంలో మిర్జాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ వైస్ చైర్మన్ లస్మన్న ప్రారంభించారు. కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యం తీసుకొచ్చి వారాలు గడుస్తున్న కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో ముథోల్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం మహగాం వెళ్లి నిరసన తెలిపారు. దీంతో స్పందించిన అధికారులు ఆదివారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో రాజు, వైస్చైర్మన్ లస్మన్న, డైరెక్టర్ సాయినాథ్, మాజీ సర్పంచ్లు రాకేశ్, చిన్నన్న , రైతులు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం

బాసర, మే 18 :నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ, వీహబ్ మధ్య ఆదివారం హైదరాబాద్లో అవగాహన ఒప్పందం జరిగింది, సీఎం రేవంత్రెడ్డి సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారు.. ఈ సందర్భంగా వీసీ వైస్ఛాన్స్లర్ ప్రొఫేసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఒప్పందం లక్ష్యాన్ని వివరించారు. విద్యార్థులకు వృత్తిపరమైన శిక్షణ, ఇంటర్న్షిప్ అవకాశాలు కల్పించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, వీహబ్ మెంటర్షిప్, స్కిల్స్ ట్రైనింగ్, ఎంటర్ప్రెసర్ మద్దతు వంటి కార్యకలాపాల ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించనుందని తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫేసర్ మురళీదర్శన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

హక్కుపత్రాలు లేని గిరిజనేతరుల భూములు స్వాధీనం

కడెం, మే 18: అటవీ హక్కు పత్రాలు లేని గిరిజనేతరుల భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని కడెం, ఉడుంపూర్ డిప్యూటీ రేంజ్ అధికారులు సిద్ధార్థ, ప్రకాశ్ అన్నారు. ఆదివారం కడెం, ఉడుంపూర్ రేంజ్ల పరిధిలోని పాండ్వాపూర్, కల్లెడ, దోస్తీనగర్లో రెండు రేంజ్ల అధికారులు వేర్వేరుగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ హక్కు పత్రాలు లేని వారు అటవీ భూములను గతంలో ఆక్రమించిన, ప్రస్తుతానికి సాగులో ఉన్న తిరిగి తీసుకుంటామని, ఇది చట్టవిరుద్ధమని అన్నారు. ఆక్రమణకు గురైన అటవీ భూములను ఖాళీ చేయని పక్షాన ఆక్రమార్కులపై అటవీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు ప్రసాద్, సరిత పాల్గొన్నారు.

పసిపాప సంరక్షణకు కదిలిన యంత్రాంగం

- నమస్తే కథనానికి కలెక్టర్ స్పందన

తండ్రి, కుటుంబానికి కౌన్సెలింగ్ ఇస్తున్న ప్రొటెక్షన్ ఆఫీసర్ స్వామి

ఎదులాపురం, మే 18 : ఆదిలాబాద్ జిల్లా రూరల్ మండలంలోని తిప్ప గ్రామ మినీ అంగన్వాడీ కార్యకర్త ఆత్రం రాణిబాయి అకాల మృతితో నెల రోజుల పసిపాప భవిష్యత్ ప్రశ్నార్థకమైందని 'నమస్తే తెలంగాణ'లో ఆదివారం ప్రచురితమైన 'అమ్మ మృతితో పసిపాప భవితవ్యం' ప్రశ్నార్థకం' శీర్షిక కథనానికి కలెక్టర్ రాజర్షి షా తక్షణమై స్పందించారు. జిల్లా సంక్షేమాధికారి మిల్కాకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందన మేరకు ఆదివారం ఐసీపీఎస్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నీలం స్వామి, ఔట్రీచ్ వర్కర్ అశ్విని తిప్ప గ్రామానికి వెళ్లి పాప తండ్రి, నాయనమ్మ, తాతయ్యలతో మాట్లాడారు. పసిపాప సంరక్షణ బాధ్యతను ప్రభుత్వ శిశుగృహానికి అప్పగించాలని వారు కుటుంబ సభ్యులకు వివరించారు. మొదట్లో నిరాకరించిన కుటుంబ సభ్యులను అధికారులు గంటపాటు కౌన్సెలింగ్ చేసి ఒప్పించారు. అవసరమైనన్ని సార్లు శిశుగృహానికి వచ్చి పాపను చూసుకోవచ్చని కుటుంబీకులకు అధికారులు అన్నారు.

పుర వీధుల్లో వెలుగులు

గోట్కూరిలో వెలుగుతున్న విద్యుత్ దీపాలు

తాంసి, మే 18: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలో గోట్కూరి గ్రామంలో లోవోల్టేజీతో పురవీధులు అంధకారంగా మారాయని ఇటీవల నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం విద్యుత్ లైన్మెన్ దేవరావ్, గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజారెడ్డి సమస్యను పరిష్కరించి గ్రామంలోని పురవీధుల్లో విద్యుత్ దీపాలను పునరుద్ధరించి వెలుగులు నింపారు. సమస్యను ప్రచురించి పరిష్కరించేందుకు కృషి చేసినందుకు నమస్తే తెలంగాణ యాజమాన్యానికి గ్రామస్తులతో పాటు బీఆర్ఎస్ నాయకులు నిమ్మల సురేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

నర్సాపూర్ (జీ) లో దొంగతనం

నర్సాపూర్ (జీ), మే 18 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)లో శనివారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. మండల కేంద్రానికి చెందిన సావిత్రి భర్త పీరాజీ ప్రతిరోజూ లాగే శనివారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి ఆరు బయట నిద్రించారు. ఆదివారం ఉదయం లేచి చూసే సరికి వేసిన తాళం పగలగొట్టి ఉంది. ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం పగలగొట్టి ఉండడంతో కుటుంబ సభ్యులు ఖంగుతిన్నారు. ఈ నేపథ్యంలో బీరువాలో దాచి ఉంచిన 5 తులాల వెండి పట్టి గొలుసులను దొంగలు ఎత్తుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యజమాని సావిత్రి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్ఐ శంకర్ విచారణ చేపట్టారు.

విద్యుత్ షాక్తో రెండు కంకలు మృతి

బోథ్, మే 18: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కుచులాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం విద్